క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



పెనమలూరు: ఎస్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యాన మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 300 మందికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శేషగిరిరావు, కనక మహాలక్ష్మి, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టైటస్‌పాల్, జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానియేలు, మండల కార్యదర్శి కె.పిచ్చేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీపై దాడి

పెనమలూరు: పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ బొమ్మసాని శ్రీనివాసరావుపై ఒక వ్యక్తి దాడి చేశాడు. దీంతో ఈవోపీఆర్డీ పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈవోపీఆర్డీ తన ఫిర్యాదులో వివరాలు తెలుపుతూ.. తాను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విధులు నిర్వహిస్తున్న సమయంలో పెనమలూరుకు చెందిన ముప్పాళ్ల బద్రినారాయణ కార్యాలయానికి వచ్చాడన్నారు. పెనమలూరు గ్రామ పంచాయతీపై బద్రినారాయణ చేసిన ఫిర్యాదుకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుపై ఒత్తిడి తీసుకువచ్చాడు. దీనికి ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగానే నిబంధనల మేరకు తాను నివేదిక ఇస్తానన్నారు. దీంతో బద్రినారాయణ ఆగ్రహంతో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు చొక్కా పట్టుకుని లాగి పిడిగుద్దులు గుద్దుతూ దాడి చేశాడు. ఈ ఘటనపై ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసినందుకు కేసు నమోదు చేశామని పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపారు.

శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలి



కంకిపాడు: శ్మశాన వాటిక సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజు విలేకరులతో మాట్లాడుతూ కుందేరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో 600 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. శ్మశానానికి ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో ఏళ్ల తరబడి కాలువ డొంక అంచులోనే మృతదేహాలను ఖననం చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి శ్మశాన వాటికకు స్థలం కేటాయించి మౌలిక వసతులను కల్పించాలని కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విశాఖపట్నానికి చెందిన నాగచందన బృందం సోమవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీనిధి, సంహిత, గీతిక, శ్రేష్ఠ, మౌల్య, హస్విత, సాత్విక, యష్మిత, వైనవి, అనన్య, జసీనా, పల్లవి తదితరులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందాన్ని ఆలయ డీఈవో రత్నరాజు అభినందించి దేవస్థానం తరఫున ప్రసాదాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు.

అడుగుకో గొయ్యి.. వెళ్లేదెలానోయి.!



ఉయ్యూరు ఫైర్‌స్టేషన్ డొంక ఎదురుగా అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు



మంటాడ శివాలయం వద్ద రోడ్డుపై గోతులు

- అధ్వానంగా మంటాడ-ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు
- రాకపోకలు నరకప్రాయం
- ప్రమాదాలు నిత్యకృత్యం

అడుగుకో గొయ్యి.. ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు.. రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజానీకం. ఒళ్లూ.. వాహనాలు గుల్ల అవుతున్నాయంటూ వాపోతున్న వాహనదారులు. ఈ సమస్యలకు కేరాఫ్‌గా ఉయ్యూరు-మంటాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం మారింది.

ఉయ్యూరు: పామర్రు, పమిడిముక్కల వైపు నుంచి ఉయ్యూరు పట్టణానికి వచ్చేందుకు ప్రధాన మార్గం మంటాడ-ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. అయితే ఈ రోడ్డు మార్గం మంటాడ శివాలయం నుంచి ఉయ్యూరు బస్టాండు వరకు అధ్వానంగా మారింది. రోడ్డంతా గోతులమయంగా తయారైంది. ద్విచక్రవాహనాలపై కూడా రాకపోకలు సాగించలేని భయానక పరిస్థితి నెలకొంది. ఉయ్యూరు పరిసర గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, ఇతర అవసరాలకు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. గతుకుల రోడ్డుపై రాకపోకలు సాగించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ గోతులు పడటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

వాహనాలు గుల్లగుల్ల

రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో వాహనాలు గుల్లవుతున్నాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు వంటి వాహనాలు గోతుల్లో పడి దెబ్బతిని పోతున్నాయి. వాహనాల మరమ్మతులకు నెలకు వేలకు వేలు పెట్టాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వాహనాల్లో ప్రయాణించే క్రమంలో గోతుల్లో కుదుపులకు ప్రయాణికులు ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. రోడ్డుపై ఇసుక ట్రాక్టర్లు, నిర్మాణ సామాగ్రికి చెందిన వాహనాలు సంచరిస్తుండటంతో దుమ్ము, ధూళి పడి ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రయాణం నరకం



మాది పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామం. అన్ని అవసరాలకు మేము ఉయ్యూరు రావాల్సిందే. మంటాడ మీదుగా వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మీద బైక్‌పై కూడా వెళ్లలేకపోతున్నాం. ఎక్కడ పడితే అక్కడ గోతులు ఉండటంతో ఆరోగ్య సమస్యలు ఉన్న వారు నరకయాతన పడుతున్నారు.

–కొణతం శివరామకృష్ణ, కపిలేశ్వరపురం

గోతులు పూడ్చండి



ఉయ్యూరు నుంచి మంటాడ వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మొత్తం గోతులే. ప్రతి రోజూ పనులకు ఈ రోడ్డుగుండానే రాకపోకలు సాగిస్తాం. పెద్ద పెద్ద గోతులు, కోతకు గురైన మార్జిన్లతో ప్రయాణాలు సాగించలేకపోతున్నాం. నిత్యం ప్రమాదాలు చూస్తున్నాం. దుమ్ము, ధూళితో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలి.

–చెవ్వూరి కనకదుర్గారావు, ఉయ్యూరు

అవాంటెల్‌తో సిద్ధార్థ అకాడమీ ఒప్పందం



ఎంవోయూ చేసుకున్న వైస్‌చాన్స్‌లర్ వెంకటేశ్వరరావు, అవాంటెల్ ప్రతినిధి

పెనమలూరు: అవాంటెల్ సంస్థతో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఎంవోయూ చేసుకుంది. ఈ మేరకు కాలేజీలో సోమవారం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, అవాంటెల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ వివరాలు తెలుపుతూ ఆధునిక కమ్యూనికేషన్ సిస్టమ్స్, టెక్నాలజీ సొల్యూషన్స్‌లో ప్రముఖ సంస్థ అవాంటెల్ సహకారంతో ఎంటెక్ ప్రోగ్రాం బలోపేతం చేయడానికి ఒప్పందం చేసుకున్నామన్నారు. అవాంటెల్ ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా అమూల్యమైన అనుభవాన్ని పొందగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.వి. రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్ర, కాలేజీ ప్రతినిధులు కె.శ్రీనివాస్, డాక్టర్ డి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలని నిరసన



కామయ్యతోపులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నేతలు



గన్నవరంలో నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

పెనమలూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కానూరు కామయ్యతోపు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని రుజువైందన్నారు. సీపీఐ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న హోం మంత్రి అంబేడ్కర్‌ను కించపరచడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, రెడ్ ఫ్లాగ్ అధ్యక్షుడు మరీదు ప్రసాద్, ఐద్వా నేతలు పుసునూరి పాతాళలక్ష్మి, నేతలు షేక్ మస్తాన్‌వలి, షేక్ వలిబి, విజయ్‌బాబు, కొక్కిలిగడ్డ శ్యామ్‌బాబు, షేక్ బాబు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరం: అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి వామపక్ష నేతలు పూలమాలలు వేసి నిరసన తెలియజేశారు. అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వామపక్ష నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, కట్టవరపు విజయరావు, నూతక్కి మోహన్‌రావు, బడుగు మరియదాసు, ఉదయ్ పాల్గొన్నారు.

ఉంగుటూరు: అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వాఖ్యలకు నిరసనగా వామపక్ష నేతలు ఉంగుటూరు సెంటర్‌లో సోమవారం నిరసన చేశారు. అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు తెల్లాకుల వెంకటలక్ష్మణస్వామి, నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, భీమవరపు సుబ్బారెడ్డి, పిల్లి రాజారావు, పులి శ్రీనివాసరావు, సీహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కంకిపాడు: అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్షాలు కంకిపాడులో సోమవారం నిరసన చేపట్టారు. బస్టాండు కూడలిలో చేపట్టిన ఆందోళనలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఆజాద్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. వామపక్ష నేతలు తాడంకి నరేష్, వి.శివశంకర్, సి.హెచ్. శ్రీహరి, వి.జాన్‌మోజేస్, జె.రవి, సి.హెచ్.వి రెడ్డయ్య, కె.నాంచారయ్య, వి.వెంకటేశ్వరరావు, ఎం.మాధవరావు, దివ్యప్రశాంతి, సత్యం, పాశం రవికుమార్ పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము విడుదల

పెనమలూరు: మండల పరిధిలో వివిధ పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము విడుదల చేసినట్లు తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ.. తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం 12,715 మంది పింఛన్‌దారులు ఉన్నారని చెప్పారు. వారికి రూ. 5.47 కోట్లు, పెనమలూరు మండలంలో 5,758 మందికి రూ. 2.42 కోట్లు సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మంగళవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు ఉపసర్పంచ్ ఒంగూరు పుణ్యవతిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మెజార్టీ పాలకవర్గ సభ్యులు సిద్ధమయ్యారు. పంచాయతీ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఉపసర్పంచ్ పదవిపై పోటీ నెలకుంది. దీంతో అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నిర్ణయంతో 5 సంవత్సరాల పదవీ కాలాన్ని 2.5 సంవత్సరాలుగా విభజిస్తూ వార్డు సభ్యులుగా గెలుపొందిన ఒంగూరు పుణ్యవతి తొలి పర్యాయం, రెండో పర్యాయం పట్టపు రాజా పేర్లను ప్రతిపాధిస్తూ సీల్డ్ కవర్‌లో తన నిర్ణయాన్ని తెలియజేశారు. దీనికి సభ్యులు ఏకాభిప్రాయం తెలిపారు. కాగా తొలి పర్యాయం ఉపసర్పంచ్‌గా ఎంపికైన పుణ్యవతికి కేటాయించిన 2.5 సంవత్సరాల పదవీకాలం పూర్తి అయి చాలా కాలం అవుతున్నా తన పదవీకి రాజీనామా చేయలేదు. దీంతో మెజార్టీ వార్డు సభ్యులు రాజీనామా చేయాలని కోరినా పెడ చెవిన పెట్టడంతో అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు.

చెట్లు నరికిన వ్యక్తికి రూ. 50 వేలు జరిమానా

పెనమలూరు: విజయవాడ-అవనిగడ్డ కరకట్ట పక్కన కేఈబీ కెనాల్ కట్టపై ఉన్న చెట్లను నరికిన వ్యక్తులతో రూ. 50 వేల జరిమానా సోమవారం పంచాయతీ అధికారులు కట్టించారు. పెదపులిపాక గ్రామ పరిధి కేఈబీ కెనాల్ కాలువ కట్టపై భారీ వృక్షాలు ఉన్నాయి. ఈ వృక్షాలను యాంత్రాలతో రెండు రోజుల క్రితం నరికివేశారు. సమాచారం తెలుసుకున్న గ్రామ పంచాయతీ అధికారులు కలప లోడ్‌తో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో కలప మాఫియా వచ్చి గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసాచౌదరిని కలిశారు. భవిష్యత్తులో వృక్షాల జోలికి వెళ్లమని తెలిపారు. దీంతో నరికిన చెట్లకు రూ. 50 వేల జరిమానా గ్రామ పంచాయతీ కట్టించారు. కాగా సర్పంచి శ్రీనివాసాచౌదరి మాట్లాడుతూ కరకట్టపై ఉన్న చెట్లను ఇరిగేషన్ ఉద్యోగి అండదండలతోనే నరుకుతున్నారని, అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



ఈడుపుగల్లులో జిల్లా స్థాయికి ఎంపికైన నమూనా



బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో ప్రాజెక్టులను తిలకిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కంకిపాడు: మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులతో నమూనాలను రూపొందింప చేసి ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నారు. క్విజ్ పోటీల్లో పునాదిపాడు జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వ్యక్తిగత విద్యార్థి విభాగంలో మంతెన పాఠశాల విద్యార్థి ఆర్.తనీష్, విద్యార్థుల సమూహ విభాగంలో కంకిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉపాధ్యాయ కేటగిరీలో వీఎస్ఎన్ మల్లేశ్వరరావు రూపొందించిన చంద్రయాన్ నమూనా జిల్లాస్థాయికి ఎంపికైంది. ప్రతిభ చాటిన విద్యార్థులు జనవరి 2వ తేదీన గుడివాడలోని మాంటిస్సోరి కళాశాలలో నిర్వహించే జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొననున్నారు. ప్రదర్శనను ఎంఈఓ-1 శేషగిరిరావు, ఎంఈఓ-2 కేవీఎస్‌వీ ప్రసాద్, కాంప్లెక్స్ హెచ్‌ఎం పద్మావతిభాయ్ పర్యవేక్షించారు.

బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు ప్రారంభించారు. మండలంలోని పలు మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూళ్లకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులతో ఆకట్టుకున్నారు. ఎంపీడీవో జోగేశ్వరరావు, ఎంఈఓలు శ్రీరామ్ బాలాసింగ్, సురేష్‌కుమార్‌లు విద్యార్థుల ప్రాజెక్టులను ఎంతో ఆకస్తిగా తిలకించారు. ఆయా సైన్స్ ప్రాజెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మండల సైన్స్ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గన్నవరం చేరుకున్న యూటీఎఫ్ జిల్లా ప్రచారయాత్ర



యూటీఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న నాగేశ్వరరావు

గన్నవరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా చేపట్టిన ప్రచారయాత్ర సోమవారం గన్నవరం చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యూటీఎఫ్ పతాకాన్ని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 5 నుండి 8వ తేదీ వరకు కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలను భావితరాలు చిరకాలం గుర్తుంచుకునేలా నిర్వహించనున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బీ కనకరావు, గౌరవాధ్యక్షుడు లెనిన్‌బాబు, సహాధ్యక్షుడు నీలం ప్రభాకర్, కోశాధికారి మరీదు వరప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ పీ ప్రసాదరావు, మండల నాయకులు రాజబాబు, రవిబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

కంకిపాడు: యూటీఎఫ్ 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. జనవరి 5 నుంచి 8 తేదీల్లో కాకినాడలో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం కంకిపాడులో ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనకారావు, షౌకత్ హుస్సేన్, నీలం ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు లెనిన్‌బాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుచ్చయ్యబాబు, శ్రీనివాసరావు కార్యదర్శులు జోగిరాజు, శ్రీరామ్, పలువురు జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగుభూములకు యాజమాన్య హక్కులు కల్పించండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం పరిధిలోని ఆర్ఎస్ నెం. 67లో పేదలకు కేటాయించిన సేద్యపు భూమిపై యాజమాన్య హక్కులు కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. వీఎన్.పురం కాలనీలో సోమవారం తహసీల్దారు కె. వెంకటశివయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు సదరు సేద్యపు భూముల లబ్ధిదారులు వినతిపత్రం సమర్పించారు. 1993లో పేదలకు 25 సెంట్లు చొప్పున రెవెన్యూ అధికారులు భూములు కేటాయించారని చెప్పారు. సదరు భూములకు 2007లో డి-ఫారం పట్టాలతో పాటు పాస్ పుస్తకాలను రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారని గుర్తు చేశారు. సదరు భూములను కుటుంబ, పిల్లల వివాహ అవసరాలను నిమిత్తం 2023లో జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం. 596 ప్రకారం సాగుదారులకు భూహక్కు, యాజమాన్య హక్కులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, పలువురు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వేదిక అని డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారు. డెప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు భాస్కర్‌రావు, ఆర్ఐ ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలోత్సవంలో ఓవరాల్ చాంపియన్‌గా స్రవంతి విద్యార్థులు



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామకృష్ణ

గన్నవరం: జిల్లా స్థాయి బాలోత్సవం పోటీల్లో స్థానిక స్రవంతి హైస్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో బహుమతులు సాధించి విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జూనియర్ మైమింగ్, సీనియర్ నాటిక, జానపద నృత్యం, సీనియర్, జూనియర్ క్విజ్, కోలాటం, సీనియర్ కథా విశ్లేషణలో ప్రథమ స్థానాలు సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఏకపాత్రాభినయం, జూనియర్ న్యూస్ రైటింగ్, జూనియర్ దేశభక్తి గీతాలాపనలో ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. బేబీ జూనియర్స్ అక్షరాల ఏరుట, సబ్‌జూనియర్ నీతిపద్యం, జూనియర్ న్యూస్ రైటింగ్, సీనియర్ స్పెల్‌బీ, సీనియర్ మైమింగ్‌లో తృతీయ స్థానాల్లో నిలిచినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎట్టకేలకు రోడ్డు విస్తరణకు సన్నాహాలు

- ఆక్రమణలు తొలగింపునకు మార్కింగ్
- డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు





పోరంకి-నిడమానూరు రోడ్డులో ఉన్న ఆక్రమణలు

పెనమలూరు: పోరంకి-నిడమానూరు రహదారి విస్తరణ పనులకు సన్నాహాలు చేపట్టారు. అలాగే డ్రెయినేజీ నిర్మాణానికి అంచనాలు వేశారు. రహదారి మార్జిన్లు పూర్తిగా ఆక్రమణలకు గురవ్వడంతో వాటిని తొగించనున్నారు. వివరాల్లోకి వెళితే.. జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం పోరంకి-నిడమానూరు రోడ్డు 80 అడుగులుగా ఉంది. అయితే వాస్తవానికి ఈ రోడ్డు 20 అడుగులు కూడా వెడల్పు లేదు. దీంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ అవుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణ చేయాలని గతం నుంచి సన్నాహాలు చేస్తున్నా ఆచరణలో జరగలేదు.

ఆక్రమణనకు గురైన రోడ్డు

పోరంకి-నిడమానూరు రోడ్డు పూర్తిగా ఆక్రమణల్లో ఉంది. బందరు రోడ్డు నుంచి వేణుగోపాలస్వామి గుడి వరకు పక్కా భవన నిర్మాణాలు ఉన్నాయి. 80 అడుగులు రోడ్డు ఈ ప్రాంతంలో విస్తరించాలంటే భవన యజమానులు సహకరించాలి. ఇక వేణుగోపాలస్వామి గుడి నుంచి బార్ షాపు వరకు రోడ్డు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. రోడ్డు మార్జిన్‌లో బడ్డీ కొట్లు, ఇతర దుకాణాలు ఉన్నాయి. ప్రధానంగా డ్రెయినేజీలపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో తరచుగా సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షం చినుకు పడితే వేణుగోపాలస్వామి గుడి నుంచి మహాలక్ష్మీనగర్‌రోడ్డు వరకు రహదారిపై రెండు అడుగుల లోతు డ్రెయినేజీ నీరు నిలిచిపోతుంది. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతుంది. రోడ్డుపై వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో ఆక్రమణలు తొలగింపునకు మార్కింగ్ చేశారు.

డ్రెయినేజీల నిర్మాణం

కాగా పోరంకి-నిడమానూరు రోడ్డు విస్తరణతో పాటు డ్రెయినేజీ నిర్మాణం చేయాలని మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. దాదాపు రూ. 40 లక్షలతో రోడ్డు విస్తరించి ఇరుపక్కలా డ్రెయినేజీ నిర్మాణం చేయనున్నారు. ఈ మేరకు అంచనాలు రూపొందించారు. నేడో రేపో పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పక్కా డ్రెయినేజీలు నిర్మాణం చేస్తే ముంపు సమస్య తీరుతుంది.

'మానవత' సేవలు అభినందనీయం



హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ వైద్యుడు దుట్టా రామచంద్రరావు పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ శాంతిరథం పేరిట అంతిమయాత్ర నిర్వహణకు ఉచితంగా అందిస్తున్న వాహనం కోసం నిర్మించిన షెడ్‌ను సోమవారం ప్రారంభించారు. డాక్టర్ దుట్టా సతీమణి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం అందించిన రూ. లక్ష విరాళంతో నిర్మించిన ఈ షెడ్‌ను మానవత వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు నేతృత్వంలో ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా వేలాది మందిలో సేవాభావాన్ని పెంపొందించడం ఎంతో ఆనందంగా ఉందని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అనంతరం శాంతిరథం షెడ్ దాత డాక్టర్ దుట్టాను మానవత సభ్యులు సత్కరించారు. మానవత సీనియర్ సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, జన్యావుల సత్యనారాయణ, గూడపాటి జయరామచంద్రరావు, వడ్డి రాజేశ్వరరావు, నారగాని కొండలరావు, కలిశెట్టి నారాయణరావు, దయాల ప్రభాకరరావు, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ పాల్గొన్నారు.